సాక్షి కర్నూలు
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



అలరించిన నృత్యప్రదర్శనలు

శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధన వేదికపై గురువారం విశాఖపట్నం ఉషోదయ కూచిపూడి కళా సంక్షేమ సంఘం, తిరుపతి వెంకటడాన్స్ అకాడమీ వారి నృత్య ప్రదర్శనలు అలరించాయి.



ఆయుర్వేదానికి నకిలీ చేటు

ఆయుర్వేద పొడుల్లో అల్లోపతి మందులు కలిపి మాత్రల రూపంలో తయారు చేసి రోగులకు అంటగడుతున్నారు. నకిలీ మందులను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,628.65
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,948
అవుట్ ఫ్లో	: 6,692

న్యూస్‌రీల్

30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: పోలీసు శాఖలో కానిస్టేబుల్ పోస్టుల నియామకానికి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 30వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలం మైదానంలో పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేహదారుఢ్య పరీక్షలతో పాటు 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగుతో పాటు లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించనున్నారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలు 2025 ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ బిందు మాధవ్ గురువారం పరిశీలించారు. మైదానంలో చేపట్టాల్సిన పనులపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ నాగేంద్ర రావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, షర్ఫుద్దీన్, మహబూబ్ బాషా, రమణ, సీఐలు, ఆర్ఎస్ఐలు ఎస్పీ వెంట పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ టీచర్ల పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి జిల్లాలోని కర్నూలు నగర పాలక సంస్థ, నంద్యాల, ఆదోనిలో మునిసిపల్ పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించేందుకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ శామ్యూల్‌పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు డీఈఓ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన, అనంతరం మధ్యాహ్నం 3గంటల నుంచి కౌన్సెలింగ్ చేపట్టనున్నట్లు వివరించారు. కాగా, పదోన్నతులకు అర్హత ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్ల జాబితాను కర్నూలు డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచామని, రెండు సెట్ల ధ్రువ పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంగ్లిషు, ఫిజికల్ సైన్స్ 1, బయలాజికల్ సైన్స్ 2, సోషల్ స్టడీస్ 1, ఆదోని, నంద్యాల మునిసిపాలిటీల్లో మ్యాథ్స్ 2, ఫిజికల్ సైన్స్ 3, బయలాజికల్ సైన్స్ 1, సోషల్ స్టడీస్ 1, సోషల్ స్టడీస్ ఉర్దూ మీడియం 1, ఫిజికల్ డైరెక్టర్ 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

రీ వాల్యుయేషన్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మే/జూన్ నెలల్లో నిర్వహించిన డిగ్రీ ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష పేపర్ల రీవాల్యుయేషన్ ఫలితాలను గురు వారం విడుదల చేశారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఫలితాలను https://rayalaseema university.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. 571 మంది రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే 122 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

అడిగిన వారందరికీ ఉపాధి కల్పించాలి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అడిగినవారందరికీ పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య.. ఏపీడీ, ఎపీవోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో ఏపీవోలు, ఏపీడీలు, ఈసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2024–25 సంవత్సరంలో 99 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 63 లక్షల పని దినాలు కల్పించడం జరిగిందని తెలిపారు. సంక్రాంతి లోపు వంద శాతం పశువుల షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయడంపై దృష్టి సారించాలని సూచించారు.

కొత్త బాదుడు

- నూతన సంవత్సరంలో ప్రజలపై మరో భారం
- భూ విలువ అమాంతం పెంచేందుకు కూటమి సర్కారు రంగం సిద్ధం
- ఆ దిశగా ఇప్పటికే రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారుల కసరత్తు
- భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు



ప్రజలను పీల్చిపిప్పి చేయడంలో తన కెవ్వరూ సాటి లేరు అన్నట్లుగా సీఎం చంద్రబాబు నాయుడు జనం నెత్తిన భారం వేస్తూనే ఉన్నారు. ఆర్నెల్ల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏదో విధంగా ప్రజలను దోచుకుంటూనే ఉంది. సంక్షేమ పథకాల ఊసెత్తకుండా.. అభివృద్ధిని విస్మరించి జనం నడ్డివిరుస్తోంది. ఇప్పటికే విద్యుత్ చార్జీల భారం మోపింది. ఇంకా కొంత మంది బిల్లులు కూడా చెల్లించలేదు. అంతలోనే కొత్త ఏడాదిని బాదుడుతో ప్రారంభించేందుకు భూములు, స్థలాల విలువ పెంచుతోంది. రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరుగుతుండటంతో అటు ప్రజలు.. ఇటు రియల్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

కర్నూలు(సెంట్రల్): ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు, పెరిగిన విద్యుత్ చార్జీలతో సతమతమవుతున్న ప్రజలపై కూటమి ప్రభుత్వం మరో బాదుడుకు రంగం సిద్ధం చేసింది. భూముల మార్కెట్ విలువ అమాంతం పెంచి దోచుకునేందుకు కసరత్తు చేస్తోంది. 2025 నూతన సంవత్సరం ఆరంభం నుంచే పెంచిన భూముల విలువను అమలు చేయనుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేయడంతో వారు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల విలువలు అమాంతంగా పెంచేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే భూముల విలువ ఎక్కువగా ఉందనుకునే ఏరియాల్లో 15 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని, భూముల విలువ తక్కువగా ఉందనుకునే ఏరియాల్లో 45 శాతం వరకు పెంచాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ మేరకు పెంపుపై రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఎక్కడ ఏ విధంగా భూముల విలువను పెంచాలనే దానిపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. కొత్త నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉన్నా.. గ్రామీణ ప్రాంతాల్లోని భూముల విలువను అమాంతంగా 45 శాతం వరకు పెంచుతారు. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల వారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలు విలువనూ పెంచనుంది. పట్టణాల్లోని అపార్టుమెంట్లలోని ఫ్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగు విలువ రూ. 900 నుంచి రూ.1,400 వరకు పెరగనుంది. ప్రాంతాల వారీగా స్థలం విలువలను బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జనవరి 1 నుంచే కొత్త మార్కెట్ విలువలు అమలు

పెంచిన మార్కెట్ విలువలు నూతన సంవత్సరం కానుకగా ప్రజలపై భారం వేయనున్నాయి. పెంచిన విలువలను ఈనెల 20వ తేదీ లోపు సబ్ రిజిస్ట్రార్లు డేటా ఎంట్రీ చేయాలి. వాటిపై 24వ తేదీ వరకు ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలి. వచ్చిన అభ్యంతరాలను 26వ తేదీ లోపు పరిష్కరించాలి. ఫైనల్‌గా 27లోపు నూతన భూముల విలువలను మార్పు చేసే ప్రక్రియ మొత్తంగా ముగియాలి. 2025 జనవరి 1 నుంచి పెంచిన విలువల ప్రకారం రిజిస్ట్రేషన్లు జరగాలి.

పెంపు కసరత్తు ఇలా..

- కర్నూలు నగరంలోని విద్యానగర్, మేడం కంపౌండ్ తదితర ప్రాంతాల్లో గజం భూమి విలువ సుమారు రూ.45 వేల వరకు ఉంది. ప్రస్తుతం అక్కడ 15 శాతం పెంచితే రూ.6,750 వరకు పెరుగుతుంది. పెంచిన తరువాత ఆ భూమి విలువ గజానికి 52,750కు చేరుతుంది.
- కర్నూలులో మండలంలో కనీస ఎకరా భూమి విలువ రూ.4.70 లక్షలుగా.. గరిష్టంగా రూ. 12 లక్షల వరకు ఉంది. దీనిని కనిష్టంగా రూ.5.50 లక్షల వరకు, గరిష్టంగా రూ.13.80 లక్షల వరకు పెంచనున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని గ్రామాల్లో కనీసంగా మార్కెట్ విలువ ఎకరానికి రూ.2 లక్షలు ఉంది. ఇక్కడ 30 శాతం వరకు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడే రోడ్డు సైడు ఉన్న పొలాలు, దేవాలయాలు, విద్యాలయాలు, పరిశ్రమలు, టూరిజం పాయింట్లకు దగ్గర ఉన్న పొలాల విలు వను 45 శాతం వరకు పెంచుతారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో భారీగా భూముల విలువ పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.
- కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీ, ఉల్చాల రోడ్డు, పెద్దపాడు సమీపాల్లో గజం ధర రూ.4,400 ఉంది. ఇక్కడ 25 శాతం వరకు పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. అంటే గజానికి రూ.1,100 పెరిగితే మొత్తంగా గజం విలువ రూ.5,500 అవుతుంది.
- ప్రస్తుతం దిన్నెదేవరపాడులో గజం ధర రూ.2,500, పెద్దపాడులో 3,500గా ఉంది. ఇక్కడ 15 నుంచి 25 శాతం వరకు పెంచేందుకు కసరత్తు జరుగుతుంది.



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

- నంద్యాల పట్టణంలోని నూనెపల్లె ప్రాంతంలో గజం రూ.4,800 ఉంది. దాని విలువ 15 శాతం పెరిగి అవకాశం ఉంది. అంటే గజం స్థలం రూ.5,600 అవుతుంది. ఇలా అన్ని చోట్ల స్థలాల విలువలను బట్టి రేట్లు భారీగా పెరగనున్నాయి.
- నంద్యాల పట్టణంలోని కల్పనాసెంటర్, షరాఫ్ బజార్, బైర్మల్‌వీధి, శ్రీనివాసనగర్ లలో ప్రస్తుతం గజం విలువ రూ.25వేలు ఉండగా 10 నుంచి 20 శాతం విలువ పెంచితే అదనంగా రూ.5 వేల పెరుగనుంది. అంటే గజం విలువ రూ.30 వేలకు చేరుకుంటుంది.
- నందికొట్కూరు పట్టణం మిడుతూరు రహదారిలో కమర్షియల్ కింద గజం విలువ రూ.4వేలు ఉండగా 15 శాతం పెంపుదలతో రూ.600 పెరుగుతుంది. దీంతో గజం స్థలం విలువ రూ.4,600కు చేరుకుంటుంది.
- క్రయ,విక్రయాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో భూమి, స్థలాల విలువలు తప్పనిసరిగా పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

రియల్ ఎస్టేట్‌కు గొడ్డలిపెట్టు...

ముక్కుతూ మూలుగుతూ నడుస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రిజిస్ట్రేషన్ల చార్జీల పెంపు గొడ్డలి పెట్టుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఉన్న భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల మార్కెట్ విలువతో వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయి. ఈ సమయంలో భూముల విలువను పెంచితే ఆ రంగం కోలుకోలేదని వ్యాపారులు భావిస్తున్నారు. ఏదైనా ప్రోత్సాహం అందించాల్సిన ప్రభుత్వం ఆదాయం కోసం మార్కెట్ విలువను పెంచడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ చర్యలతో మరో నాలుగైదేళ్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోలుకోలేని పరిస్థితి ఎదుర్కొంటుందని ఆందోళన చెందుతున్నారు.

ధరల పెంపుపై పునరాలోచన చేయాలి



రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు వల్ల సామాన్యుడిపై భారం పడుతుంది. వెలుగోడు పట్టణంలోని ప్రస్తుతం మార్కెట్ భూముల విలువ ఎకరా రూ.2,75,000 ఉంది. జనవరి ఒకటి నుంచి భూముల విలువ 40 శాతం పెంచితే ఒక ఎకరా రూ.3,85,000 మార్కెట్ విలువ అవుతుంది. దీంతో సామాన్యుడికి రిజిస్టర్ ఆఫీస్‌లో రెట్టింపు ఖర్చవుతుంది. చిన్న, సన్నకారు రైతులకు రిజిస్ట్రేషన్ చార్జీలు భారంగా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం మార్కెట్ విలువను పెంపును ఉపసంహరించుకోవాలి.

– గద్వాల వెంకటేశ్వర్లు, వెలుగోడు

ప్రజలను పీడించడం మంచి పద్ధతి కాదు



టీడీపీ కూటమి సర్కార్ అధికారంలోకి రాక మునుపు ప్రజలపై భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వరుసగా భారాలు మోపుతున్నారు. ఇప్పటికే రూ.17వలే కోట్ల విద్యుత్ చార్జీలను పెంచారు. జనవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని చూస్తున్నారు. ఇది ప్రజలను మోసం చేయడం అవుతుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చడం లేదు. పైగా ప్రజలను పన్నుల కోసం పీడించడం మంచిపద్ధతి కాదు.

– పి.రామకృష్ణారెడ్డి, నగర కార్యదర్శి, సీపీఐ, కర్నూలు

27లోపే భూముల విలువ పెంపు ప్రక్రియ పూర్తి

జనవరి 1 నుంచి పెరిగిన భూముల విలువలు రిజిస్ట్రేషన్ కోసం అమల్లో ఉంటాయి. ఈనెల 27వ తేదీలోపు భూముల విలువ పెంపు ప్రక్రియను పూర్తి చేసేలా సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు ఇచ్చాం. కనీసం 15 శాతం పెంచేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. భూముల విలువ తక్కువగా ఉన్న చోట ఎక్కువ కూడా పెంచేందుకు పరిశీలన చేస్తున్నాం.

– చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు



ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారంటే ఆ ప్రభావం కుటుంబంపై ఎలా ఉంటుందో తెలుసుకో.. హెల్మెట్ ధరించడంతో ప్రమాదాలు జరిగినప్పుడు ఎంతో మంది బతికారో చూడు.. హెల్మెట్ ధారణ బరువుగా భావించకుండా బాధ్యతగా గుర్తుంచుకో.. అంటూ ట్రాఫిక్ పోలీసులు కర్నూలు సి.క్యాంప్ సెంటర్‌లో గురువారం సాయంత్రం వాహనదారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. పలువురు ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, యువకులు, విద్యార్థులకు రోడ్డు నిబంధనల గురించి ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, సిబ్బంది వివరించారు. – కర్నూలు



దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సహిత ప్రహ్లాదవరదస్వామితోపాటు గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచి కనులపండువగా నవకలశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవ మూర్తి గోదాదేవి అమ్మవారిని ప్రత్యేక గుడిలో కొలువైన మూల విరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిధికి తోడ్కొని వచ్చి కొలువుంచారు. – ఆళ్లగడ్డ

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం రాత్రి ప్రకటన విడుదల చేసింది.


విభాగం	అధ్యక్షులు
జిల్లా మహిళా విభాగం	కె.శశికళ (ఆలూరు)
బీసీ సెల్	బి.రాఘవేంద్ర నాయుడు (కర్నూలు)
మైనార్టీ సెల్	టీఎండీ ఫిరోజ్ (కర్నూలు)
లీగల్ సెల్	పి.సువర్ణ రెడ్డి (కర్నూలు)
వైద్యుల విభాగం	ఆర్.హరికృష్ణారెడ్డి (కర్నూలు)
మేధావుల ఫోరం	హెచ్‌కే మనోహర్‌రావు (కర్నూలు)
ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం	బీఎస్ శ్రీనివాసులు (కర్నూలు)
దివ్యాంగుల విభాగం	రామాంజనేయులు (ఆలూరు)
యువత విభాగం	వై.శివకుమార్ రెడ్డి (పాణ్యం)
క్రిస్టియన్ మైనార్టీ సెల్	జి.జె. సుకుమార్ (పాణ్యం)
వాణిజ్య విభాగం	గొల్ల శ్రీనివాసులు (పాణ్యం)
వైఎస్సార్‌ట్రేడ్ యూనియర్	కె.భీమేశ్వర్ రెడ్డి (పాణ్యం)
సోషల్ మీడియా	బి.రాజశేఖర్ రెడ్డి (పాణ్యం)
బూత్ కమిటీ	బెల్లం మహేశ్వర రెడ్డి (పాణ్యం)
ఎస్సీ సెల్	ఆర్.వెంకటేశ్వర్లు (పత్తికొండ)
ఎస్టీ సెల్	ఎస్.భాస్కర్‌నాయక్ (పత్తికొండ)
వలంటీర్స్ విభాగం	ఆర్. హనుమంతు (పత్తికొండ)
సమాచార హక్కు చట్టం	మల్లికార్జున రెడ్డి (ఎమ్మిగనూరు)
చేనేత విభాగం	ఎంకే శివప్రసాద్ (ఎమ్మిగనూరు)
అంగన్‌వాడీ విభాగం	వరలక్ష్మి (ఎమ్మిగనూరు)
రైతు విభాగం	ఆర్.రవిచంద్ర రెడ్డి (మంత్రాలయం)
గ్రీవెన్స్ సెల్	జి.వెంకట్రామి రెడ్డి (మంత్రాలయం)
ఐటీ విభాగం	ఎం.జగదీష్ స్వామి (మంత్రాలయం)
విద్యార్థి విభాగం	ఆర్.ప్రశాంత్ కుమార్ (కోడుమూరు)
మున్సిపల్ విభాగం	సీహెచ్ నాగరాజు (ఆదోని)
సాంస్కృతిక విభాగం	ఎస్.గోపాల్ రెడ్డి (ఆదోని)

తుంగా తీరంలో.. చీకటి దందా!

- పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా
- రాత్రయితే ట్రాక్టర్లతో నదిని తోడేస్తున్న వైనం
- అనుమానాలకు తావిస్తున్న అధికారుల తీరు



తుంగభద్ర నదిలో మాఫియా తవ్విన గోతులు



ప్రధాన కూడలిలో తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్

మంత్రాలయం: సూర్యుడు అస్తమించగానే.. ఇసుక మాఫియా మేల్కొంటోంది. చీకటి పడగానే ట్రాక్టర్ల మోత మొదలవుతోంది. తుంగభద్ర నదిని ఇసుక తోడేళ్లు ఆక్రమిస్తాయి. 'మాకెవరు అడ్డు చెప్పేది' అంటూ.. ఏకంగా పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయాల మీదుగా రయ్.. రయ్ మంటూ అక్రమార్కుల ఇసుక ట్రాక్టర్లు దూసుకెళ్తాయి. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తుండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. శ్రీమఠం మైకుల నుంచి వచ్చే ఆధ్యాత్మిక గీతాలు వినిపించలేనంతగా ఇసుక ట్రాక్టర్ల మోత ఉందంటే ఇసుక అక్రమ రవాణా ఏపాటిదో ఇట్టే అర్థమవుతోంది. నియోజకవర్గ కేంద్రం మంత్రాలయం తుంగభద్ర నదిని అనుకుని ఉండటం ఇక్కడి ఇసుక మాఫియాకు వరంగా మారింది. చీకట్లో నదిని తోడేస్తూ దందాను దర్జాగా చేసుకుంటున్నారు. రోజూ రాత్రి కాగానే మూలన దాగిన ట్రాక్టర్లన్నీ రోడ్డెక్కు తున్నాయి. అధికార పార్టీ అండదండలు, అధికారుల నిర్లక్ష్యం మాఫియాకు కలిసొచ్చింది. మండల కేంద్రంలోని సుజయీంద్రనగర్ మీదుగా తుంగభద్ర నదిలోకి దారి ఏర్పాటు చేసుకున్నారు. అక్కడి నుంచి రోజూ వందలాది ట్రిప్పుల ఇసుకను తోడేస్తున్నారు. పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయాల మీదుగా ఇసుక ట్రాక్టర్లు పరుగుపెడుతున్నాయి. ప్రధాన రాఘవేంద్ర సర్కిల్ గంటకు 50 ట్రిప్పులు తరలిపోతున్నా యి. రాత్రంతా ఇదే దందాగా సాగిపోతోంది. ఒక్కో ట్రిప్పు ఇసుకను పట్టణంలో రూ.1,200–1,500కు, ఇతర గ్రామాలకు రూ.3,000 – 4,500 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అడ్డు గోతులను పూడ్చి.. అక్రమ రవాణా

ఇటీవల ఇసుక మాఫియా పెచ్చుమీరడంతో రెవెన్యూ కార్యాలయానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మాఫియాను కాదనలేక.. అడ్డు చెప్పే సాహసం చేయలేక దారులను మూసేశారు. సుజయీంద్రనగర్ దారిలో ట్రాక్టర్లు నదిలోకి వెళ్లకుండా ఉండేందుకు జేసీబీతో గోతులు తవ్వించారు. అయినా మాఫియా ఆగలేదు. గోతులను కొంత పూడ్చేసి మళ్లీ ఆట మొదలెట్టింది. అడ్డదారిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పేదోడి గూటికి ఇసుక ఇవ్వరుగానీ, మాఫియా వ్యాపారాలకు మాత్రం ఇక్కడ కొదవలేదు.

తెలిసినా.. చర్యలు శూన్యం

మంత్రాలయంలో ఎవరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారో అటు రెవెన్యూ.. ఇటు పోలీస్ బాస్‌లకు స్పష్టంగా తెలుసు. ఈ విషయం ఊరూరే కోడై కూస్తోంది. అడ్డుకోవాల్సిన అధికారులు మాఫియాకు రాచ మర్యాదలతో గౌరవించడం చూసిన ప్రజలు విస్తుపోతున్నారు. అధికార పార్టీకి జీహుజూర్ అనడమే పనిగా పెట్టుకున్నారు. కళ్లెదుటే ప్రకృతి సంపద కొల్లుకొడుతున్నా.. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అడ్డుకుందామనే ఆలోచన అధికారులు చేయడం లేదు. దీంతో అధికారుల తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు మేల్కొంటారో లేదో వేచి చూడాల్సిందే.

అక్రమంగా తరలిస్తే చర్యలు

మండల కేంద్రంలో జరిగే సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణం నిమిత్తం ఇసుక తరలించేందుకు రెండు ట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చాం. సదరు ట్రాక్టర్లు కాకుండా ఇతరులు ఇసుకను అక్రమంగా తరలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. నదికి వెళ్లకుండా ఇది వరకే గోతులు తవ్వించాం. నిబంధనలు విస్మరిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. శాఖాపరంగా జరిమానాలు విధిస్తాం.

– ఎస్.రవి, తహసీల్దార్, మంత్రాలయం

భార్య సీమంతం.. అంతలోనే విషాదం

- ఐదేళ్ల తర్వాత భార్య గర్భం దాల్చడంతో ఘనంగా సీమంతం
- వేడుకకు వచ్చిన బంధువును బస్సు ఎక్కించి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం



మృతిచెందిన వీరేష్ (ఫైల్)

ఆదోని అర్బన్: వివాహమైన ఐదేళ్ల తర్వాత భార్య గర్భం దాల్చడంతో ఆ కుటుంబంలో సంతోషం నిండింది. ఐదో నెల గర్భం కావడంతో ఘనంగా సీమంతం వేడుక నిర్వహించారు. వారి సంతోషాన్ని చూసి విధికి కన్నుకుట్టింది. రోడ్డు ప్రమాదం రూపంలో భర్తను కబళించడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. వివరాలు.. ఆస్పరి మండలం చిగిళి గ్రామానికి చెందిన వీరేష్ (33) ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం ఆదోని మండలం హాన్వాల్ గ్రామానికి చెందిన రాజేశ్వరిని పెళ్లి చేసుకున్నాడు. వివాహమైన ఐదేళ్లకు వీరేష్ భార్య గర్భం దాల్చింది. ఐదు నెలలు నిండడంతో సీమంతం కార్యక్రమాన్ని బుధవారం బంధువుల మధ్య ఘనంగా నిర్వహించారు. వేడుక అనంతరం ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. భార్య హాన్వాల్‌కు వెళ్లింది. హైదరాబాద్ నుంచి వచ్చిన చిన్నమ్మను గురువారం మధ్యాహ్నం వీరేష్ ఆటోలో బస్టాండుకు తీసుకెళ్లి బస్సు ఎక్కించారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా విరుపాపురం సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రక్ ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న వీరేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేరు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు వీరేష్ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారుడు కావడం, ఐదేళ్ల తర్వాత భార్య గర్భం దాల్చడంతో బిడ్డను చూడకుండానే ప్రమాదంలో మృత్యువాత పడడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. అలాగే రాజేశ్వరి స్వగృహంలో బంధువులు శోకసంద్రంలో మునిగారు. హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ వారు రోధిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.



రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

క్లుప్తంగా

రైలు నుంచి పడి వ్యక్తి మృతి


లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మద్దికెర: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మద్దికెర– గుంతకల్లు స్టేషన్ల మధ్య గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్దికెర నుంచి గుంతకల్లు వైపు వెళ్లే రైల్ ట్రాక్ 355 –11 కి.మీ. వద్ద సుమారు 60 ఏళ్ల వయసు కలిగిన ఓ వ్యక్తి రైలు నుంచి కింద పడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సెల్ నంబర్ 98661 44616 ను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ మహేంద్ర సూచించారు.

54 గొర్రెల మృత్యువాత


బొందిమడుగుల వద్ద మృతి చెందిన గొర్రెలు

తుగ్గలి: నీటి కోసం వెళ్లి గొర్రెలు మృత్యువాత పడిన ఘటన గురువారం సాయంత్రం బొందిమడుగుల వద్ద చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు వలిబాషా, ఖాజా, అంకాలప్ప, రాయల్, నాగేష్, సుంకన్న గొర్రెలు మేపుకుని చీకటి పడే సమయంలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో రోడ్డు పక్కనున్న గుంతలో నీరు తాగేందుకు వెళ్లి జీవాలు ఒకదానిపై ఒకటి పడ్డాయి. ఈ తొక్కిసలాటలో మొత్తం 54 గొర్రెలు మృత్యువాత పడినట్లు కాపరులు తెలిపారు. దాదాపు రూ.7 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

అన్నదమ్ముళ్లకు జైలు శిక్ష

బండిఆత్మకూరు: మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన అన్నదమ్ముళ్లకు నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి 10 రోజులు జైలు శిక్ష విధించినట్లు బండి ఆత్మకూరు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. వివరాల్లోకెళితే.. లక్కిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, లక్కిరెడ్డి గోవర్ధన్ రెడ్డి గ్రామంలో అసభ్యంగా తిట్టుకుంటూ, గొడవ పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్నారని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి నంద్యాల సెకండ్ క్లాస్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి 10 రోజుల జైలు శిక్ష విధించారు.

27 కేజీల గంజాయి స్వాధీనం

కర్నూలు: పేకాట కేసులో నిందితులను పట్టుకునే క్రమంలో 27 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. స్థానిక బుధవారపేటలో టీడీపీ నాయకుడికి చెందిన గోడౌన్‌లో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ నేతృత్వంలో మూడు రోజుల క్రితం పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. మొత్తం 37 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేయగా ఆర్గనైజర్ కొమ్ము రవి పారిపోయాడు. ఈ కేసులో మట్కా నిర్వాహకులు సయ్యద్, షబ్బీర్, అక్బర్‌తో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదైంది. వీరంతా జొహరాపురం శివారు కేసీ కెనాల్ కుడివైపున ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ గుడిసెలో దాగి ఉన్నట్లు సమాచారం అందడంతో గురువారం నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద 27 కేజీల గంజాయి పట్టుబడినట్లు మూడవ పట్టణ సీఐ శేషయ్య తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు.

ఆయుర్వేదానికి నకిలీ చేటు

- నాటు వైద్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు
- ఆకు పసర్లు, వాతలతోనూ వైద్యం
- నకిలీ మందులతో దెబ్బతింటున్న అవయవాలు
- పట్టించుకునే అధికారులు కరువు

ఎన్నో దీర్ఘకాలిక, మొండి వ్యాధులను ఆయుర్వేదం తగ్గిస్తుందన్నది ప్రజల్లో ఉన్న నమ్మకం. ఆ నమ్మకాన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు అక్రమ మార్గాల్లో పయనిస్తున్నారు. రోగికి త్వరగా ఫలితం రావాలని చెప్పి ఆయుర్వేద పొడుల్లో అల్లోపతి మందులు కలిపి మాత్రల రూపంలో తయారు చేసి రోగులకు అంటగడుతున్నారు. వాటిని మింగిన రోగులకు తాత్కాలికంగా ఉపశమనం ఇచ్చినా దీర్ఘకాలంలో కిడ్నీలు, కాలేయం పాడై ఆసుపత్రి పాలవుతున్నారు. వైద్యులను సంప్రదించకుండా నేరుగా మందుల దుకాణాలు, రోడ్డుపై విక్రయించే వారి వద్ద నాటు మందులు కొనుగోలు చేసి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు.


ఔషధ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆయూష్, విజిలెన్స్ అధికారులు (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు ప్రాంతాలు, చుట్టుపక్కల గ్రామాల్లో నాటు వైద్యులు అధికమయ్యారు. వారు చేసేది నకిలీ వైద్యం. కానీ ప్రసార, సామాజిక మాధ్యమాల్లో పలురకాల వ్యాధులకు నమ్మకమైన, మెరుగైన వైద్యం అందిస్తామని, అల్లోపతిలో తగ్గని వ్యాధులు తగ్గిస్తామని, దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయం చేస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ మేరకు కొందరు పట్టణాల్లోని లాడ్జిల్లో, మరికొందరు అపార్ట్‌మెంట్‌లు, అద్దె ఇళ్లల్లో, ఇంకొందరు రోడ్డు పక్కనే వ్యాపారం చేస్తున్నారు. ప్రధానంగా సంతలు, మార్కెట్ల వద్ద ఇలాంటి వారి హడావుడి అధికంగా ఉంటోంది. కర్నూలు వంటి నగరాల్లో అయితే నడిరోడ్డుపైనే వందలాది రకాల మందులను రోడ్డుపై పోసి మొండి వ్యాధులను సైతం తగ్గిస్తామని ప్రకటనలు చేస్తూ వైద్యం చేస్తున్నారు. ఇలాంటి వారి వద్దకు మొలలు, ఫిస్టులా, ఫిషర్, వరిబీజం, కీళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, సుఖవ్యాధులు, శృంగార సమస్యలు, ఎయిడ్స్, కామెర్లు, పక్షవాతం వంటి వ్యాధులకు గురైన వారు ఆకర్షితులవుతున్నారు. రోడ్డుపైనే బాహాటంగా మందులు విక్రయిస్తున్నా ఇదేమిటని ఏ ఒక్క అధికారి కూడా వారిని ప్రశ్నించడం లేదు. ఆయుర్వేదం పట్ల రోగులకు ఉన్న నమ్మకం, వారి బలహీనతను ఆసరా చేసుకుని వైద్యం చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు.

అల్లోపతి మందులతో ఆయుర్వేదం తయార్

కొన్ని రకాల వ్యాధులకు అల్లోపతి మందులు త్వరగా ఉపశమనం కలిగిస్తాయి. పలు రకాల నొప్పులు, జ్వరాలు, ఇన్‌ఫెక్షన్లకు ఇవి వెంటనే పనిచేస్తాయి. దీనికి కారణం వాటిలో వాడే స్టెరాయిడ్స్, నొప్పి నివారణ, యాంటీబయాటిక్స్ మాత్రలే. అదే ఆయుర్వేద వైద్యంలో దీర్ఘకాలిక వ్యాధులకు ఇచ్చే మందులు కొంతకాలం తర్వాత శరీరంలో మెరుగైన ఫలితాలు చూపిస్తాయని చెబుతారు. ఈ క్రమంలో దీర్ఘకాలిక మొండి వ్యాధులను తగ్గించుకునేందుకు రోగులు ఆయుర్వేద మందుల కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో వైద్యులను సంప్రదించకుండా స్నేహితులు, తెలిసిన వారు చెప్పారని కల్తీ, నకిలీ మందులు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కొన్ని రకాల మందుల్లో ఆయుర్వేద పొడులు, అల్లోపతిలో లభించే యాంటిబయాటిక్స్, నొప్పి నివారణ, స్టెరాయిడ్స్ కలిపి వాటిని ప్రత్యేక యంత్రాల ద్వారా మాత్రలు తయారు చేసి ప్యాకింగ్ చేసి రోగులకు అంటగడుతున్నారు. వాస్తవంగా అల్లోపతి మందులు వైద్యులు సూచించిన మేరకు నిర్ణీత రోజులు మాత్రమే వాడాల్సి ఉంటుంది. కానీ అల్లోపతి మందులు కలిపిన ఆయుర్వేద మందులు వాడుతూ రోగులు ప్రాణం మీదకు తెస్తున్నారు. గతంలో కర్నూలులోని వీకర్‌సెక్షన్ కాలనీ, శిల్పాటౌన్‌షిప్ రోడ్డులో ఇద్దరు వ్యక్తులు నకిలీ ఆయుర్వేద మందులు తయారు చేస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడ్డారు. వీరు తయారు చేసిన మందులను గ్రామాలు, పట్టణాలు తిరిగి అమాయకులైన వారికి అంటగట్టి సొమ్ము సంపాదించారు. ఇలాంటి వారు ఇప్పటికీ సమాజంలో ఇళ్లలో వ్యాపారాలు చేస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు. అల్లోపతి మాదిరిగా ఆయుర్వేద మందులకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు లేకపోవడంతో జిల్లాలో నకిలీ మందుల తయారీ అధికమైంది. ఎప్పుడైనా విజిలెన్స్ అధికారులు నిర్వహించే దాడుల్లో మాత్రమే నకిలీ మందులు బయటపడుతున్నాయి.

➤ కర్నూలు నగరంలోని కృష్ణానగర్‌కు సిద్దేశ్వర్ కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. స్నేహితుడు చెప్పడంతో స్థానిక ఓల్డ్ టౌన్‌లోని ఓ ఆయుర్వేద మందుల దుకాణానికి వెళ్లి మందులు కొన్నాడు. ఆ మందులు వాడిన కొద్దిసేపటికే అతని కడుపులో మంట మొదలైంది. ఒళ్లంతా చెమటలు పట్టసాగాయి. కడుపులో ఆరాటం, తీవ్ర ఆకలి వంటి లక్షణాలు కనిపించాయి. ఉపశమనం కోసం వెంటనే రెండు గ్లాసుల మజ్జిగ తాగి ఆ మందులు పడేసి ఊరుకున్నాడు. విషయాన్ని ప్రభుత్వ వైద్యుడికి చెబితే అవి నకిలీ మందులని, వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా వాడొద్దని హెచ్చరించారు.

➤ కల్లూరుకు చెందిన అనిల్‌కుమార్ నెలరోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్నేహితులు చెప్పడంతో అల్లోపతి వైద్యుల వద్దకు గాకుండా కోడుమూరులో నాటు మందులు ఇచ్చే వైద్యుని వద్దకు వెళ్లాడు. రెండుసార్లు నాటు కట్టు వేయించుకున్నా ఫలితం లేకపోగా నొప్పి మరింత అధికమైంది. దీంతో వెంటనే అల్లోపతి వైద్యుడిని సంప్రదించి ఆపరేషన్ చేయించుకున్నాడు.

➤ ఎమ్మిగనూరుకు చెందిన పెద్ద ఈరన్న లైంగిక శక్తి కోసం కర్నూలులోని ఓ లాడ్జిలో మందులు ఇస్తారని స్నేహితులు చెప్పడంతో గత నెలలో వచ్చి మందులు తీసుకున్నాడు. అవి వాడిన కొద్దిసేపు ఫలితం కనిపిస్తున్నా రానురాను పరిస్థితి మరింత దిగజారింది. దీంతో భయపడి పెద్దాసుపత్రికి వచ్చి యురాలజిస్టును కలిసి తన పరిస్థితిని వివరించి మందులు వాడటంతో బాగయ్యింది.

దాడుల్లో పట్టుబడిన నకిలీ మందులు

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గత నెల 23 నుంచి 27వ తేదీ వరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లులు, ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్లు సంయుక్తంగా పలు ఔషధ దుకాణాల్లో దాడులు నిర్వహించారు. పలు దుకాణాల్లో విస్తృతంగా నకిలీ మందులు విక్రయిస్తున్నట్లు వారి తనిఖీల్లో బయటపడింది. స్థానిక పాత బస్టాండ్‌లోని శ్రీ సంజీవిని ఆయుర్వేదిక్ దుకాణంలో జీఎంపీ సర్టిఫికెట్ లేని మూడు ఆయుర్వేద మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కొత్తబస్టాండ్ సమీపంలోని సిరిగిరి వెంకప్ప ఆయుర్వేదిక్ స్టోర్‌లో అనుమతిలేని కంపెనీల మందులను విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. పాతబస్టాండ్‌లోని మహావీర్ మెడికల్ ఏజెన్సీలో ఆయుష్ విభాగం అనుమతి లేకుండా పలు రకాల ఆయుర్వేద మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నంద్యాలలో వెంకప్ప ఆయుర్వేదిక్ ఏజెన్సీని సందర్శించి బిల్లులు సరిగా లేని మందులను సేకరించారు. ఈ మేరకు సంబంధిత వ్యాపారులపై అధికారులు కేసులు నమోదు చేసి చర్యలకు సిఫారసు చేశారు.

వైద్యుల సూచన లేకుండా మందులు వాడొద్దు



తెలిసిన వారు, స్నేహితులు చెప్పారని ఎక్కడ పడితే అక్కడ మందులు కొని వాడే వారి సంఖ్య ఇటీవల అధికమైంది. ఇందులో చాలా వరకు నకిలీ మందులు ఉంటున్నాయి. ఇలాంటి మందులు వాడితే కిడ్నీ, కాలేయం పాడవుతాయి. బ్యాచ్‌లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ (బీఏఎంఎస్) కోర్సు చేసిన నిపుణులైన వైద్యులు మాత్రమే ఆయుర్వేద చికిత్స చేయాలి. వంశపారంపర్యంగా వచ్చిందని, ఫలానా గురువు వద్ద నేర్చుకున్నామని, మాది గిరిజన ప్రాంతమని చెప్పి ఎవరుపడితే వారు వైద్యం చేయడానికి వీల్లేదు. ఆయుర్వేద మూలికలను నేరుగా వాడకూడదు. వాటిని నిర్ణీత పద్ధతిలో శుద్ధి చేసి మాత్రమే వాడాలి. శుద్ధిచేయని ఆయుర్వేద మందులు, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ కలిపి తయారు చేసిన మందులు వాడటం వల్ల ఉన్న రోగాలు తగ్గకపోగా ప్రాణాంతకం అవుతుంది.

– డాక్టర్ పీవీ.నాగరాజ, సీనియర్ ఆయుర్వేద వైద్యులు, కర్నూలు

నకిలీ మందులతో ప్రాణం మీదకు వచ్చింది



దీర్ఘకాలంగా కీళ్ల వ్యాధులు, కడుపులో మంట వంటి సమస్యలతో బాధపడుతున్న మా స్నేహితుడు ఒకరు పాతబస్తీలోని ఓ మందుల దుకాణంలో మందులు కొని వాడారు. ఊరు, పేరులేని మందులు వాడటం వల్ల నొప్పులు తాత్కాలికంగా తగ్గాయి. ఆ తర్వాత రెండు వారాలకు కడుపులో నొప్పి ప్రారంభమై తీవ్ర గ్యాస్ట్రిక్ సమస్యకు దారి తీసింది. క్రమంగా అతని రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. అతన్ని అల్లోపతి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తే కొద్దిగా కోలుకున్నాడు. మొండివ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు తగ్గిస్తామని చాలా మంది ప్రజలను మోసగిస్తూ వైద్యం చేస్తున్నారు. ఇలాంటి వారి ప్రకటనలు నమ్మి మోసపోవద్దు.

– ప్రతాపరెడ్డి, కర్నూలు

అడ్డు తొలగించుకునేందుకే హత్యాయత్నం

- ప్రియురాలితో పాటు మరో నలుగురి అరెస్ట్
- దాడికి పాల్పడిన వారంతా ఇంజినీరింగ్ విద్యార్థులు


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల: రెండు రోజుల క్రితం గాజులదిన్నె ప్రాజెక్టు సమీపం ఎల్లెల్సీ కాలువ వద్ద వడ్డె అరవిందస్వామిపై జరిగిన హత్యాయత్నం కేసులో ప్రియురాలు బుట్టా ప్రియాంక, మరో నాలుగురిని పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ గంగాధర్ వెల్లడించారు. ఎమ్మిగనూరుకు చెందిన వడ్డె అరవింద స్వామి, బుట్టా ప్రియాంక ప్రేమించుకున్నారు. వీరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో దూరంగా ఉన్నారు. ప్రియాంక ప్రస్తుతం ఎర్రకోట ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అదే కళాశాలలో చదివే ఈడిగ భరత్‌తో ప్రేమాయణం సాగిస్తోంది. అతని సాయంతో అరవింద స్వామిని చంపాలని పథకం వేసింది. గాజులదిన్నె ప్రాజెక్టు ఎల్లెల్సీ వద్దకు వెళ్లి రెక్కీ కూడా నిర్వహించింది. అనుకున్న ప్రకారం మంగళవారం ఉదయం ప్రియాంక, అరవింద స్వామిని ప్రాజెక్టు వద్దకు తీసుకొచ్చి భరత్‌కు సమాచారం ఇచ్చింది. భరత్ దేవబెట్ట గ్రామానికి చెందిన తన స్నేహితులు వడ్ల కుమారస్వామి, గంధాల ప్రశాంత్‌కుమార్, కోడుమూరుకు చెందిన ఎరుకలి రామాంజనేయులుతో కలిసి వెళ్లి అరవింద స్వామిపై వేట కొడవళ్లతో దాడి చేశారు. బాధితుడు కేకలు వేయడంతో సమీప పొలంలో ఉన్న రైతులు దాడి అడ్డుకుని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం సాయంత్రం బి.అగ్రహారం గ్రామం మల్లెల వాగు వంక వద్ద ప్రియాంక, భరత్, కుమారస్వామి, ప్రశాంత్‌కుమార్, రామాంజనేయులు దాక్కున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి నిందితులను అరెస్టు చేసి ఐదు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన వేట కొడవలి, పల్సర్ బైక్, హోండా ఆక్టివా మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు సీఐ గంగాధర్ వెల్లడించారు. ఈడిగ భరత్, ప్రియాంక బీటెక్ సీఈసీ మూడో సంవత్సరం, ఎరుకలి రామాంజనేయులు, వడ్ల కుమారస్వామి అదే కళాశాలలో బీఫార్మసీ చదువుతున్నారు. గంధాల ప్రశాంత్ కుమార్ పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం నాపరాతి పనిచేస్తున్నాడు.

క్రీడాకారులకు అభినందన


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఇటీవల ఢిల్లీలో జరిగిన 68వ జాతీయ కరాటే అండర్–17 బాలుర విభాగంలో జిల్లాకు చెందిన క్రీడాకారులు వెంకటశ్రీ, దినేష్, స్వర్ణ పతకాలు, అండర్–14 విభాగంలో కంచి హవీష్, హేమంత్‌కుమార్ రెడ్డి, బాలికల విభాగంలో కరిమెట్ల యశ్మిత, గోపగ్న వెండి పతకాలు సాధించారు. వీరిని కలెక్టర్ ఉపాధ్యాయుల సమావేశంలో అభినందించి భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఈఓ శామ్యూల్‌పాల్, బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మీ, డీసీఓ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణం పాల్గొన్నారు.

ట్రైనీ డీఎస్పీ, సీఐ విచారణ


ముత్తుకూరులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐ మస్తాన్ వలి

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో హనుమంతు అనే వ్యక్తి ఈనెల 17వ తేదీన మతిస్థిమితం లేని మహిళను ఇంట్లో నిర్బంధించి అత్యాచారం చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. గురువారం ముత్తుకూరు గ్రామంలోని ఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐ మస్తాన్ వలి సందర్శించి విచారణ చేపట్టారు.

‘పది’ విద్యార్థుల ఉత్తీర్ణత బాధ్యత ఉపాధ్యాయులదే


పది పరీక్షల కార్యాచరణను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, డీఈఓ శామ్యూల్‌పాల్ తదితరులు

- 15 రోజుల్లో అందుబాటులోకి వర్చువల్ తరగతులు
- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పదో తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత అయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. ఉపాధ్యాయులకు మెడికల్ ఎమర్జెన్సీ తప్పా ఇతర సందర్భాల్లో దీర్ఘకాలిక సెలవులు మంజూరు చేయరాదని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం పెంపుపై ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ అధికారులు, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గతేడాది తక్కువ ఉత్తీర్ణత శాతం ఉన్న మండలాల ఎంఈఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. అందుకు కారణాలు.. ఈ సంవత్సరం ఎక్కువ శాతం ఫలితాలు నమోదు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా బీ, సీ గ్రేడు విద్యార్థులపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లకు సూచన చేశారు. ఇప్పటి నుంచైనా విద్యార్థులు చదువుకోవడానికి అనువైన పరిస్థితులు కల్పించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ అవర్లను ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు పాఠశాలలను పర్యవేక్షణ చేసి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. 15 రోజుల్లో విద్యార్థులకు వర్చువల్ తరగతులను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. అనంతరం పదో తరగతి పరీక్షలకు సంబంధించిన కార్యాచరణను కలెక్టర్ ఆవిష్కరించారు.

దుప్పి మాంసం స్వాధీనం

- తప్పించుకున్న వన్యప్రాణి వేటగాళ్లు
- సినీ ఫక్కీలో ఛేజింగ్
- పారిపోతూ బాలుడిని ఢీకొట్టిన వేటగాళ్ల బైక్

ఆత్మకూరురూరల్: సిద్దాపురం గ్రామానికి చెందిన వణ్యప్రాణి వేటగాళ్లు దుప్పిని వధించి మాంసాన్ని ఆత్మకూరులో విక్రయించేందుకు బైక్‌పై వస్తున్నారని సమాచారం అందడంతో గురువారం స్థానిక ముష్టపల్లె రహదారి మలుపు వద్ద డివిజన్ యాంటీ పోచింగ్ (వన్యప్రాణి వేట నివారణ దళం) స్క్వాడ్ సిబ్బంది గస్తీ చేపట్టారు. అటవీ సిబ్బందిని గమనించిన దుండగులు బైక్ వేగం పెంచి పక్కనున్న మరో మార్గంలోకి వాహనం మళ్లించారు. అప్రమత్తమైన సిబ్బంది తమ వాహనంతో వెంబడించగా వేగంగా వెళుతున్న దుండగుల బైక్ ఆ మార్గంలో వెళుతున్న బాలుడిని ఢీకొట్టింది. ఆ బాలుడికి గాయాలయ్యాయి. అయినా దుండగులు వేగం తగ్గించకుండా చేతిలోని మూటను కిందకు వదలి అటవీ సిబ్బంది కనుచూపునుంచి మాయమైపోయారు. దుండగులు వదలి వేసిన మూటలో 40 కేజీల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్న అటవీ సిబ్బంది గాయపడిన బాలుడిని ఆసుపత్రిలో చేర్పారు. ఈ ఘటనపై పీఓఆర్ తయారు చేసి నిందితులుగా అనుమానిస్తున్న వారి కోసం గాలింపు చేపట్టారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

కర్నూలు: నగరానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సురేష్ బాబు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన ఇతను పదేళ్లుగా కర్నూలులోని గణేష్ నగర్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. గురువారం ఉదయం కృష్ణానగర్ సమీపంలో డోన్ వైపు వెళ్తున్న గూడ్స్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కో పైలట్ సతీష్ ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు రైల్వే పీఎస్ ఎస్ఐ కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులను విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స


కోలుకున్న బాలుడు ఇర్ఫాన్, అతని తల్లితో వైద్య బృందం


బాలుడి నడుముకు గుచ్చుకున్న కొయ్య (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): చెట్టుమీద నుంచి జారిపడిన బాలుడి నడుముకు కొయ్య గుచ్చుకోవడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. గురువారం ఆసుపత్రి పీడియాట్రిక్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ శివకుమార్ వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా కనేకల్‌కు చెందిన దాదావలి, గౌసియా కుమారుడైన ఇర్ఫాన్ (12) గత నెల 15న రేగి చెట్టు ఎక్కి పండ్లు కోస్తూ కాలు జారి పడ్డాడు. ఆ సమయంలో ఓ ఎండిన కొయ్య బాలుడి నడుములోకి గుచ్చుకుంది. కుటుంబసభ్యులు బాలుడిని ఆస్పత్రికి తీసుకురాగా పీడియాట్రిక్ సర్జరీలో చేర్చారు. సీనియర్ వైద్యులు డి.నరేష్, ఎ.మధు, బి.ప్రియాంక, ప్రణీత్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఫియాజుద్దీన్ మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి చెట్టు కొయ్యను బయటకు తీశారు. బాలుడు కోలుకోవడంతో అదే నెల 22వ తేదీన డిశ్చార్జ్ చేశారు. గురువారం ఆ బాలుడిని మరోసారి చికిత్సకు తీసుకురావడంతో వైద్యులు పరిశీలించి పూర్తిగా కోలుకున్నట్లు నిర్ధారించారు. ఈ బాలుడికి ఆరోగ్యశ్రీ కార్డు లేకపోయినా అత్యవసర ఆపరేషన్ చేశామని, ప్రైవేటులో ఈ ఆపరేషన్‌కు రూ.లక్షకు పైగా ఖర్చవుతుందని డాక్టర్ శివకుమార్ వెల్లడించారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం చెంచుగూడెం సమీపంలో గొర్రెలను నిలిపి ఉన్న షేక్ అర్షత్ వలీ (32)ని గొడ్డలితో నరికి చంపాడని భావిస్తున్న నిందితుడు షేక్ షఫీని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ కేసుపై గురువారం ఆత్మకూరు అర్బన్ పీఎస్‌లో సీఐ రాము వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న ఇందిరేశ్వరం చెంచుగూడెం సమీపంలో గొర్రెల మందలను నిలుపుకుని ఉన్న హర్షత్ వలీ, షేక్ షఫీ మధ్య గొర్రెలను మేపే విషయంలో ఘర్షణ ఏర్పడింది. అర్షత్ వలీ మందుతున్న కర్రతో షఫీ వీపుపై కొట్టాడు. ఆగ్రహించిన షఫీ చేతిలో ఉన్న గొడ్డలితో హర్షత్ వలీ తలపై నరకడంతో రక్తపు మడుగులో కుప్పకూలిపోయాడు. భయభ్రాంతులకు గురైన షఫీ అక్కడినుంచి పారిపోయాడు. అక్కడున్న మరో కాపరి రాజ్‌కుమార్ గాయపడిన హర్షత్ వలీని ఆటోలో ఆత్మకూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య షేక్ నసిమూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రాము కేసు నమోదు చేశారు. నిందితుడు షఫీ స్థానిక నంద్యాల టర్నింగ్ వద్ద ఉన్నాడన్న సమాచారం మేరకు అదుపులోనికి తీసుకుని కోర్టులో హాజరుపరచగా జడ్జి 15 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు నారాయణ రెడ్డి, హుస్సేన్ బాషా, ఏఎస్ఐ శంకరరెడ్డి, సంజీవుడు తదితరులు ఉన్నారు.